

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 10 జనవరి, 2014 సంచిక : 8

(విజయ నామ సం॥, మాఘ మాసం)

**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావుగారు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణగారు** M.Tech

**శ్రీ ఆర్. వెంకట శివప్రసాద్**

**సాయివాణి చందా వివరాలు**

| | | |
|---|---|---|
| విడి ప్రతి | ......... రూ॥ | 6/- |
| వార్షిక చందా | ......... రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం | ......... రూ॥ | 600/- |

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

**Ph : 9440413455, 9848133565**

Website : www.saidhamam.org

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .................................................. 2

ఇది కరుణాసాగరం .................................. 5

శ్రీ సాయి-సేవ ........................................... 8

శ్రీ గజానన విజయం ................................ 11

స్వరాంజలి-యతిగీతలో ............................ 13

మహిళా సాయిభక్తులకు ............................. 14

సిద్ధ భూమి ............................................... 15

మాతృసంస్థ కబుర్లు ................................. 23







# మా వాణి



ప్రియ సాయివాణి పాఠక మిత్రులందరికీ శుభాకాంక్షలు.

జనవరి అనగానే సంక్రాంతి, గణతంత్ర దినం, శుద్ధ ఏకాదశిన వచ్చే వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం యిలాంటి ఉత్సవాలన్నీ వచ్చేస్తాయి. ఈ నడిమికాలంలో మన సంస్కృతిలోకి చొచ్చుకు వచ్చిన జనవరి 1నాటి నూతన సంవత్సరపు తొలిరోజు హడావుడి వీటికి తోడైంది. మంచుపొరలను చీల్చి కరిగిస్తూ నారింజరంగుతో పాకి వచ్చే సూర్యుడు, ఆయన కిరణాల తాకిడికి మంచి ముత్యాల్లాగా మెరుస్తూ మిల మిలలాడే-బంతి, చేమంతి పూలరెక్కల చివళ్ళ, పచ్చిక కొసలపైనా ఉన్న మంచు చుక్కలు, హరివిల్లు నేలకు వాలినట్లు ముంగిట్లో పరుచుకొన్న ముగ్గులు (ముత్యాల పందిరి, బ్రహ్మపీఠం, తాబేలు, తామరకొలను, మల్లెపందిరి, విస్తరి, అరిటాకు, గులాబితోట, సర్పనాట్యం, స్వర్గద్వారాలు-ఎన్ని పేర్లో, ఎన్ని ముగ్గులో నేలకే పూసినట్లు.) ఆ ముగ్గుల మధ్య, ముద్దుగా ఒదిగి-తలలలో గుమ్మడి పూలు సింగారించుకొని పసుపు కుంకుమల చీరలు కట్టుకొని కూర్చున్న గొబ్బెమ్మలు, పెరళ్లలో పాలపొంగళ్లు, వేకువలో బుడబుక్కల వాళ్లు, జంగమదేవరలు, సూర్యోదయవేళ వచ్చే గంగిరెడ్లు, హరిదాసులు, పగటి వేషగాళ్లు-హడావుడిగా, భారంగా నడిచి వచ్చే ధాన్యపుబళ్లు, పెరళ్లలో విరగకాసే గుమ్మళ్లు, అత్తవారిళ్లకు వచ్చే అల్లుళ్లు, వంటిట్లోంచీ కమ్మని అరిసెల వాసనలు ... అదో అద్భుతమైన పండుగ సంక్రాంతి. గ్రామలక్ష్మీ సౌభాగ్యానికి నిలువెత్తు నిదర్శనం సంక్రాంతి.

ఈసారి 11వ తేదీన వైకుంఠ ఏకాదశి. గజగజలాడించే చలిలో తలారా స్నానాలు చేసి పసుపు కుంకుమలు, పూలు పళ్లతో విష్ణ్వాలయాల

ఉత్తర ద్వారదర్శనానికి తరలి వెడతారు భక్తులు. ఆరు నెలలుగా శయనించి ఉన్న శ్రీ మహావిష్ణువు ఆనాడు యోగమాయ నుండి విడివడి లేస్తాడని శాస్త్రోక్తి. అందుకే దానిని ఉత్థానైకాదశి అని కూడా అంటారు. ఆ వేళ వైకుంఠంలో ఉత్తరద్వారం దగ్గర దర్శనమిస్తారట శ్రీహరి. అద్భుతమైన అలంకరణతో స్వామి వారిని ఆలయ ఉత్తర ద్వారాల దగ్గర వేంచేపు చేస్తారు. మహత్తరమైన పర్వదినమిది. ఆ తిథి, వాతావరణం కూడా ఆరోగ్యప్రదమైనవి.

ఇక మన గణతంత్ర దినం సంగతి చెప్పకోనక్కరలేనంతగా మనందరి జీవితాలతో పెనవేసుకుపోయిన పర్వం. ఎటొచ్చీ దురదృష్టవశాత్తు దీనిని మనం మనసారా ఆనందించలేని పరిస్థితులు దేశంలో నెలకొన్నాయి. ఎన్నడో ఇందిరమ్మ కాలంలోనే భూస్థాపితమైపోయిన పార్టీ పేరు చెప్పకొంటూ విదేశీ ఆత్మతో కునారిల్లే పార్టీ ఒకటి-ఓ ప్రక్క 'అఖండ భారత్' అని కూస్తూనే మరోప్రక్క నిండుగా ఉన్న రాష్ట్రాలను ముక్కలు చెక్కలు చేసేందుకు పూనుకొన్న పార్టీ ఒకటి-కుల, మత ద్వేషాలను, కుల వ్యవస్థను వ్యతిరేకిస్తున్నామంటూనే ఆ కుల, మత ప్రాతిపదిక మీదనే వర్ధిల్లుతున్న పార్టీలు కొన్ని-ఎవరికి వారే 'ధర్మపరులకు ఓట్లు వేయండి' అని చేసే ప్రచారాలతో విసిగిపోయి, ఎవడు పెద్ద మూట విప్పితే వాడివైపే దూకేద్దామనుకొనే గొర్రెలు-సందట్లో సడేమియాగా ప్రతి పార్టీలోనూ చెలరేగిపోయే గూండాలు-వీరందరి మధ్యా నలుగుతున్న చదరంగపు బల్ల మీద రానున్న ఎలెక్షన్లు. ఇలాటి భ్రష్ట స్థితిలో కూడా దీన్ని బాగుచేసే చైతన్యం, చేవ లేకపోగా-తమ వీరత్వాన్నీ, యౌవనశక్తినీ వయోభేదం, వావి వరసలూ కూడా మరచి, కాముకతతో కళ్ళు మూసుకుపోయి విజృంభిస్తున్న నీచపుంస్త్వం............ అమ్మా, భారతీ! వీర ప్రసూతవన్న పేరుగన్న దానివి ఇలాటి కుక్కమూతి పిందెలను కంటున్నావేమమ్మా! - అని ఏకాస్త విజ్ఞత ఉన్నవాడైనా కుమిలిపోయే యీ స్థితిలో గణతంత్ర దినోత్సవం





జరుపుకోవాలన్న ఉత్సాహం ఎలా వస్తుంది? ఏది ఏమైనా, తమలో ఎందరి ప్రాణాలు అన్యాయంగా సరిహద్దుల్లో బలైపోతున్నాయో చూస్తూ కూడా ఒక్కసారైనా 'దెబ్బకు దెబ్బ తీయండి' అనలేని తమ సిగ్గుమాలిన నాయకులను సహించి యింకా మనను వైరిదేశాల నుండీ రక్షిస్తున్న మన భద్రతాదళాలకు జోహార్లు!


తన బూడిదలోనుంచే తిరిగి లేచే ఫీనిక్స్ పక్షిలాగా వచ్చే ఎలెక్షన్లలోనైనా దేశీయతను, సద్ధర్మాన్ని, రక్షణ పటిమను, పౌరులందరికీ ఒకే చట్టాన్ని, న్యాయాన్నీ తేగల ప్రభుత్వం ఏర్పడుతుందని ఆశిస్తూ, తీర్చమని యీ నవ సంవత్సరాన్ని కోరుదాం.

ఆ ఆశతోనే యీ నెలలోని పండుగలను, సంప్రదాయాలను గుర్తెరిగి, మన భావి పౌరులకు కూడా ఎరుకపరుస్తూ జరుపుకొందాం.

**ప్రియ పాఠకులందరికీ 2014వ సంవత్సరారంభ శుభాకాంక్షలు. ఈ సంవత్సరకాలం మీకు సమస్త శుభాలనూ యిచ్చి, శ్రీ సాయికి మరికాస్త చేరువ చేసే సాధనను ప్రసాదించాలని సాయివాణి తన శుభ కామనను అందిస్తోంది.**

**అలాగే - తాను ఇరవై నాలుగవ ఏట అడుగుపెడుతున్న తరుణంలో ముందరికంటె ఎక్కువ సేవ చేసేందుకై మీ ఆశీస్సులను, అండదండలను కోరుకొంటోంది. సాయివాణి తనకు పాఠకులైన ప్రతి వారినీ మరిద్దరు క్రొత్త వారిని జత తెచ్చుకొమ్మని కోరుతున్నది.**

# ఇది కరుణాసాగరం



**– 'శ్రీ రమణ కరుణా విలాసం' నుండి**

పెరుమాళ్ళ స్వామి భగవాన్ విరూపాక్ష గుహలో ఉన్నప్పుడు సర్వాధికారి శ్రీ రమణునికి సేవ చేసిన వారిలో ముఖ్యుడు. నాగ సుందరం (శ్రీ రమణుని సోదరుడు) మొదటిసారి రమణాశ్రమం వచ్చినప్పుడు "అతనిని కూడా మనతో ఉంచుకుందాం" అన్నాడు పెరుమాళ్లస్వామి శ్రీ రమణునితో. రమణుడు "పెరుమాళ్లూ! ఇప్పుడు అతనిని మన దగ్గరే ఉంచుకుందాం అంటున్నావు. భవిష్యత్తులో అధికారం కోసం ఇద్దరూ పోట్లాడుకుంటారు. తరువాత నీ ఇష్టం. అన్నారు "అలా జరగనే జరగదు" అన్నాడు పెరుమాళ్ళు. శ్రీ రమణుడు సహజ మౌనముద్రాలంకుతులయ్యారు. పెరుమాళ్ళ పర్వదిన సందర్భాలలో భక్తితో శ్రీ రమణుని పంచలోహ విగ్రహాన్ని నెత్తిన పెట్టుకొని ఊరేగించేవాడు.

"పెరుమాళ్ళూ! ఇప్పుడు ప్రేమతో నా విగ్రహాన్ని నెత్తిమీద పెట్టుకొని తిరుగుతున్నావు. భవిష్యత్తులో ద్వేషంతో నా నెత్తి మీద కాలు పెట్టి తొక్కుతావు. ఈ చేష్టలన్నీ అహంకార లక్షణాలు. ఉన్నట్లుండు! ఈ ఊరేగింపులు ఏమీ నాకు అక్కరలేదు" అన్నారు. శ్రీ రమణ భగవాన్. "నా ప్రాణం పోయినా అట్లా చేయను" అన్నాడు పెరుమాళ్ళు. తరువాత ఆశ్రమాధిపత్య విషయమై పెరుమాళ్ళ స్వామికి నాగసుందరానికి మధ్య బద్ధవైరం ఏర్పడింది. పెరుమాళ్ళస్వామి కోర్టుకెక్కారు. శ్రీ రమణుని కోర్టు బోను ఎక్కించాలని చూశాడు. "శ్రీ రమణుని నిజస్వరూపం" అనే పుస్తకం వ్రాశాడు. పుస్తకంలో శ్రీ రమణుడు ఇద్దరు యువతుల భుజాల మీద చేతులు వేసి నుంచున్నట్లు ట్రిక్కు ఫొటో తీసి ప్రచురించాడు. శ్రీ రమణుని





విగ్రహం నెత్తి మీద కాలుపెట్టి ఫొటో దిగి ఆ పుస్తకంలో అచ్చువేశాడు. శ్రీ రమణుని మీద చాలా నీచంగా వ్రాశాడు.

ఒకరోజున ఆశ్రమాధికారులు, భక్తులు కలిసి ఆగ్రహంతో ఆ పుస్తకాన్ని శ్రీ రమణునికి చూపించారు. శ్రీ రమణులకు కోపం వస్తే పెరుమాళ్ళు నాశనం అయిపోతాడని వాళ్ల భావం. శ్రీ రమణుడే ఆ పుస్తకం అంతా అమూలాగ్రం చదివి తన బీరువాలో భద్రంగా పెట్టుకున్నారు. ఏమీ మాట్లాడకుండా మౌనం వహించారు. ఆశ్రమం వారికి ఒళ్ళు మండిపోయింది. ఆయన ముందు మాట్లాడే ధైర్యం లేక మౌనంగా ఉన్నారు. ఎవరైనా శ్రీ రమణుని ముందు పెరుమాళ్ళను దూషిస్తే "ఉచ్ఛం, నీచం అనే తేడా లేకుండా ఎన్నో సంవత్సరాలు నాకు సేవ చేశాడు. వాడికి నా మీద మమకారం ఉన్నప్పుడు నెత్తి మీద పెట్టుకున్నాడు. ఇప్పుడు అహంకారంతో నా నెత్తి మీద కాలు పెట్టాడు. ఇది మానవనైజం. నాకు రెండూ సమానమే. ఇక వాడు వ్రాసిన పుస్తకం అంటారా! వాడికి అహంకారం వచ్చింది. ద్వేషంతో వ్రాశాడు. మీకు తెలిసింది మీరు వ్రాస్తున్నారు. నేను ఎవరో మీకు తెలిశానా! వాడికి తెలియకపోయానా! ఎవరి ఇష్టం వచ్చినట్టువారు వ్రాసుకుంటారు. నాకు ఎవరి మీద కోపమూ లేదు, ప్రేమా లేదు. నాకు అందరూ సమానమే" అన్నారు. ఇంకొకసారి "వాడిని మాయ అట్లా ఆడిస్తోంది. వాడి తప్పేముంది? వాడి చేతుల్లో ఏమీ లేదు. ఈనాడు ఇక్కడే ఉంటే నాగసుందరం తరువాత రమణాశ్రమానికి అధికారి అయ్యేవాడు. పరమేశ్వరుని ఆజ్ఞ ఎవరికి ఎరుక"! అన్నారు. శ్రీ రమణుడు తప్పు చేసినా వారిని విమర్శిస్తే ఊరుకునేవారు కారు. పైగా వారు చేసిన మంచిపనులు చెప్పేవారు.

పెరుమాళ్ళస్వామికి చివరి రోజులలో శక్తియుక్తులు ఉడిగిపోయాయి. తన అశక్తత తెలియవచ్చింది. అప్పుడు జ్ఞానోదయమయింది. తన తప్పు

తెలిసి వచ్చింది. పశ్చాత్తాపంతో దహించుకుపోసాగాడు. భగవాన్ ఒకరోజున ఒక చెట్టు క్రింద కూర్చున్నారు చుట్టూ భక్తులు. అప్పుడు పెరుమాళ్ళు సూటిగా వచ్చి భగవాన్ రెండు కాళ్ళు పట్టుకొని “నరకానికి పోయే పనులు చేశాను. నన్ను మన్నించి అభయమివ్వండి” అని వెక్కి వెక్కి ఏడ్చాడు. శ్రీ రమణులు ప్రశాంతంగా “అంత నమ్మకమే ఉంటే నీవు నరకానికి పోయినా తప్పకుండా కాపాడుతాను” అని అభయమిచ్చారు.

కొన్నిరోజులు ఈశాన్య మఠంవారు ఆదరించారు. పెరుమాళ్ళు స్వామి చివరిలో దుర్భర దారిద్ర్యంతో చూసే దిక్కూ, పెట్టే నాధుడూ లేక రోడ్ల మీద నరకయాతన పడి చనిపోయాడు. అహంకారం అంత పనిచేస్తుంది! జ్ఞాని సమక్షంలో చేసిన కర్మ ఏదైనా దాని ఫలితం వెంటనే అనుభవించ వలసే వస్తుంది. భగవాన్ చివరి రోజులలో ఆంతరంగిక భక్తుడు ఒకరు రమణుల పుండును చూపిస్తూ - “మీకు ఈ ప్రారబ్ధం ఎక్కడిది?” అని కన్నీళ్ళు పెట్టుకున్నారు. భగవాన్ రహస్యం చెపుతున్నట్లు ఆ భక్తునితో “పెరుమాళ్ళు కోపంతో నా విగ్రహం భుజం విరగ్గొట్టాడు కదా! ఆ పాపం కూడా నేనే తీసుకున్నాను. వాడు ఆ పాపం అనుభవించగలడా చెప్పు! వాడు సేవ చేసినప్పుడు నేను ఆనందంగా స్వీకరించలేదా! అలాగే వాడు చేసిన పాపం కూడా స్వీకరించొద్దా!” అన్నారు. ఇది విన్న భక్తుడు నిబిడాశ్చర్యంతో శిలా విగ్రహంలా బిగుసుకుపోయాడు. గురువులు భక్తుల పాపాలను స్వీకరించటం తెలుసు గానీ-శిష్యుడు తన యెడల చేసిన పాపం కూడా తాను తీసుకున్న గురువు ఎక్కడైనా ఉంటాడా! మనం ఎప్పుడైనా గురుపరంపరలో ఇలాంటివి కన్నామా! విన్నామా! నభూతో నభవిష్యతి. ఇలా తన యెడల ఎంతమంది చేసిన పాపాలు రమణుడు తీసుకున్నారో వారికే ఎరుక! ఆ భక్తుడి కళ్ళనుండి ఆనందబాష్పాలు అప్రయత్నంగా రాలాయి.





# శ్రీ సాయి-సేవ

## శ్రీసాయి సేవ అవసరమా?

**– సాయివాణీ ప్రచురణలు**

**(గత సంచిక తరువాయి)**

అటు ఎఫిమ్‌కు దారిలో ఒక సన్యాసి తోడయ్యాడు. ఇద్దరూ కలిసి జెరూసలేమ్ చేరుకున్నారు. ఈ సన్యాసి తన దగ్గరున్న డబ్బు గురించి ఎంతో జాగ్రత్త పడటం గమనించాడు ఎఫిమ్. జెరూసలేమ్‌లో క్రీస్తును సిలువ వేసిన చోటును చూచారు ‘పునరుత్థాన చర్చి’ అనేచోట. అక్కడ తొడతొక్కిడిగా ఉంది. ఓ ప్రక్కగా నిలబడి జన సందోహాన్ని చూస్తున్న ఎఫిమ్‌కు దూరంగా ఆ దీపాల క్రింద సమాధికి నమస్కరిస్తున్న ఎలీజా కన్పించాడు.

“ఇదెలా సంభవం? నాకన్నా ముందే వచ్చాడా ఎలీజా!”

ఎఫిమ్ అతన్ని కలుసుకోవాలని అందరినీ నెట్టుకుంటూ ముందుకు వెళ్ళాడుగానీ ప్రయోజనం లేకపోయింది. ఎటు తప్పుకున్నాడోగానీ ఎలీజా దొరకలేదతనికి. నగరంలోని ప్రసిద్ధ ప్రదేశాలన్నీ గాలించి నిరాశపడి ఊరుకున్నాడు ఎఫిమ్.

మరునాడు కూడా ఆ చర్చికే వెళ్ళాడతను. అప్పుడు కూడా దూరంగా ఎలీజా కనిపించాడు. కానీ తీరా పట్టుకోబోతే జారిపోయాడు. ఆరు వారాల పాటు జెరూసలేమ్‌లోనే ఉన్న ఎఫిమ్ అక్కడి మట్టినీ, పవిత్ర తీర్థాన్నీ తీసుకొని యింటి త్రోవపట్టాడు. దారిలోనే అతనికి యింటి చింత పట్టుకొంది. అలా ఆలోచిస్తూనే అతడు తానూ, ఎలీజా విడిపోయిన

ఊళ్ళోకి వచ్చాడు.

ఊరి బయట ఒక గుడిసె దగ్గరకు రాగానే అతనికొక అమ్మాయి ఎదురువచ్చింది. తమ యింటికి రమ్మని ఆహ్వానించింది. లోపలికి వెళ్లాక ఆ పిల్లతల్లి రాత్రికి తమ ఆతిథ్యం తీసుకొని అక్కడే ఉండమని కోరింది. తదుపరి పాలు, పరమాన్నంతోసహా అతనికి మంచిభోజనం పెట్టారు.

భోజనాలైపోయి తీరికగా కూర్చున్నప్పుడు ఆ పెద్దావిడ యిలా అంది. "కటువుబారిన పడి మేము దైవాన్నే మర్చిపోయాము. ఆకలీ దాహాలతో చచ్చే స్థితిలో ఉన్నప్పుడు ... ఆయనే ఒక పెద్దమనిషిని మాకోసం పంపించాడు. ఆయన మా ప్రాణాలు రక్షించాడు. మా కాళ్ళ మీద మేము నిలబడేందుకు సహాయం చేసాడు. మా పాలిట అతడో గొప్ప దేవదూత. అతిథులను ఆదరించటం ఏమిటో అతని దగ్గరే నేర్చుకున్నాము. సాటి మనుష్యుల మీదా, దేవుడి మీదా కూడా విశ్వాసం పోగొట్టుకొని కేవలం జంతువుల్లా బ్రతుకుతున్న మాలో-దైవవిశ్వాసాన్ని నిద్రలేపి మమ్మల్ని మనుష్యులను చేసిన పుణ్యాత్ముడాయనే.

ఎలీజా పోలికలకు ఆ యింటి వాళ్ళు చెప్తున్న వ్యక్తి పోలికలు సరిపోతున్నాయి. కానీ తాను అతన్ని జెరూసలేమ్‌లో ఒకటికి రెండుసార్లు చూచాడే! అతను అంతకాలం యిక్కడి ఉండి, తనకన్నా ముందుగానే యాత్రా స్థలానికి చేరుకోవటం అన్నది అసాధ్యం. మొత్తం మీద నా యాత్ర సఫలమైనా కాకపోయినా ఎలీజా యాత్ర మాత్రం భగవదనుగ్రహానికి పాత్రమైంది-అని తనలో తానే అనుకొన్నాడు.

కొన్ని రోజులకు ఇంటికి చేరుకున్నాడు. తన కుటుంబ పరిస్థితులన్నీ అస్తవ్యస్తమైపోయి వున్నాయి. మరునాడు ఎలీజా యింటికి వెళ్లాడు. అతని భార్య ఎఫిమ్‌ను సాదరంగా ఆహ్వానించి భర్త దగ్గరకు తీసుకువెళ్లింది.





అప్పుడు ఎలీజా చేతులు పైకెత్తి ఆకాశంవైపు చూస్తూ ప్రార్థన చేస్తున్నాడు. ఆ తల, చేతులు, భుజాలు ... అవును తాను జెరూసలేమ్‌లో చూచింది ఇతన్నే! సూర్యకిరణాలు పండిపోయిన ఎలీజా తలచుట్టూ కాంతిచక్రాన్ని ఏర్పరుస్తున్నాయి.

ఎఫిమ్‌లో ఏదో తెలియని సంచలనం! అంతలో ఎలీజా తలత్రిప్పి చూచి మిత్రుడిని ప్రేమగా పలకరించాడు.

"క్షేమంగా చేరుకున్నావా?"

"ఆఁ! నా కాళ్లు వెనక్కు లాక్కువచ్చాయి గానీ నా ఆత్మ అక్కడే ఉంది".

"అది భగవత్కార్యం మిత్రమా! రా, రా, కాస్త తేనె తాగుదాం" ఎలీజా విషయం మార్చేసి కుటుంబ విషయాలు మాట్లాడసాగాడు.

ఎఫిమ్ నిట్టూర్చాడు. త్రోవలోని ఆ గుడిసెలోని పేదల గురించి చెబుదామనుకొన్నాడు. అది అతనికొక అత్యద్భుతమైన బలమైన అనుభవం. అది అతనిలో చాలా లోతైన మార్పును కలిగించింది. ఇప్పుడతడు మానవ జీవితాన్ని అర్థం చేసుకోగలిగాడు. "ప్రతి మనిషి జీవితాన్నీ కడపటి క్షణం దాకా పరమాత్ముడే శాసిస్తాడు. మనం ఆయన ఋణాన్ని ప్రేమ ద్వారా సత్కార్యాల ద్వారానే తీర్చుకోగలం" ఇది అతనికి అవగాహనకు వచ్చింది. ఇది అతని జీవితాన్నే మార్చేసింది. సేవకే అంకితం చేసింది.

అందుచేత మిత్రులారా, మనం మనవారనో, మరొకటో కాక-నిస్వార్థంగా ఎక్కడ ఆర్తితో వున్న ఎవరికి ఎలాంటి సేవ చేసినా అది దైవార్పితంగా భావిస్తే తప్పక ఆయనకే చెందుతుంది. అంతేకాదు ... అలా జన కళ్యాణం కోసం పనిచేసే వాడిని భగవంతుడు ప్రేమిస్తాడన్నది కూడా నిర్వివాదం. ఎలాగంటే -

**(సశేషం)**

# శ్రీ గజానన విజయం



- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు

**(గత సంచిక తరువాయి)**

బంకట్‌లాల్ యింటికి వస్తూనే తండ్రి భవనీరామ్ దగ్గరకు వెళ్ళి గజానన మహారాజును తమ యింటికి ఆహ్వానించేటట్లుగా ఆయన్ను ఒప్పించాడు. ఇప్పడు వారిని ఎప్పడు ఎలా కలుసుకోవాలి, ఎలా యింటికి రప్పించాలి అని ఆలోచిస్తున్నారు.

సరిగ్గా నాలుగు రోజుల తరువాత ఒక సాయంత్రం వేళ ఆ స్వామి మాణిక్ కూడలి వద్ద కన్పించారు. గోవులతో పరివేష్టింపబడి అలనాటి గోపాలకృష్ణుడిని తలపింపజేస్తున్నారు.

బంకట్‌లాల్ వారిని ప్రార్థించి తమ యింటికి తీసికొని వెళ్ళాడు. బంకట్‌లాల్ తండ్రి భవానీలాల్ తమ యింటికి సాక్షాత్తు పాండురంగడే ఏతెంచినట్లుగా సంబరపడ్డాడు. స్వామిని ఆసీనులను చేసి బిల్వపత్రాలతో పూజించారు. రాత్రి భోజనానికి ఉండవలసిందిగా ప్రార్థించాడు. ఇంకా వంటలు కాలేదు. స్వామి అప్పటిదాకా తమ యింట్లోనే ఉంటారో, ఉండరో అని అనుమానం వచ్చి ఆనాడు ఉదయం చేసిన పూరీలు, ఎండుఖర్జూ రాలు, బాదంపప్పులు మొదలైన వాటిని భక్తితో నివేదించాడు. అతని భక్తిప్రపత్తులకు మెచ్చుకొని స్వామి ఆ రాత్రికి అక్కడే ఉండిపోయారు.

ఆ మరుసటి ఉదయం బంకట్‌లాల్ స్వామికి మంగళస్నానాలకు ఏర్పాటు చేశాడు. అనేకమంది దాంట్లో పాల్గొని వంద కలశాల గోరు వెచ్చని నీటితో స్వామికి స్నానం చేయించారు. అది ఎంత అద్భుతమైన దృశ్యము! స్త్రీ, పురుషులందరూ తమ తమ భక్తికొద్దీ దాంట్లో పాల్గొన్నారు. కొందరు సబ్బు రుద్దారు. కొందరు కుంకుడుకాయలతో తలంటుపోశారు. కొందరు ఆయన పాదపద్మాలను రుద్దారు. స్నానానంతరం పట్టు ధోవతి





కట్టించారు, కాషాయరంగు కలిపిన మంచి గంధం పూతలు పూశారు. తులసీ దళాలతో అర్చించారు. అనేకమైన పూలమాలలతో అలంకరించారు. ఆ స్వామికి ఇవేమీ పట్టలేదు. భక్తుల ఆనందంకోసం వీటన్నిటినీ సహించారు.

ఆ సాయంత్రం బంకట్‌లాల్ పినతండ్రి కుమారుడు ఇచ్ఛారామ్ ఎన్నో రకాల మిఠాయిలు స్వామి ముందరపెట్టి వాటిని వారు స్వీకరించకపోతే తాను ఆహారమే ముట్టనని భీష్మించాడు. ఆ మిఠాయిలతోపాటు రకరకాల కూరలు, పచ్చళ్ళు, పెరుగూ మొదలైనవి కూడా సమర్పించుకున్నాడు. ఆ పదార్థాలన్నీ నలుగురు మనుషులు సుష్టుగా భోంచేయటానికి సరిపడేట్లుగా ఉన్నాయి.

స్వామి తనలో తాను "మిఠాయిలు తినాలని ఆశపడుతున్నావుగా- తిను తిను" అంటూ గబగబా మింగేసి, వెంటనే మొత్తం కక్కేశారు. సమర్థ రామదాస స్వామి కూడా ఒకప్పుడిలాగే చేశారు. అతిగా భోజన ప్రియత్వం చూపించడం దోషమని గుర్తు చేసుకోవడానికి, భక్తులు సాధువులను యిలా ఒత్తిడిచేయటం దోషమని తెలియజేయటానికి మహాత్ములు యిలా చేస్తారు.


మళ్ళీ స్వామికి అంతకుముందు మాదిరిగానే మంగళస్నానం చేయించారు. ఆ సమయంలో అటుగా రెండు భజన మండళ్ళు పండరి భజన చేస్తూ వెళుతున్నాయి. సాధు మహరాజు కూడా దాంతో గొంతు కలిపారు. అయితే వారు పాడింది 'గణగణ గణాత్ బోలే" అని మహారాజ్ ఎప్పడూ ఈ భజనే చేసేవారు. దీనినిబట్టే ప్రజలు వారిని గజానన మహారాజు అని పిలవటం ప్రారంభించారు. అయినా భగవంతునితో తాదాత్మ్యం చెందిన వారికి రూపమేమిటి, నామమేమిటి?

భక్తులకు షేగాం గ్రామమే పండరిపురం అయిపోయింది. బంకట్‌లాల్ యిల్లు రోజూ భక్తులతో కిటకిటలాడిపొయ్యేది. క్రమంగా అది ఒక దేవాలయంగా మారిపోయింది.

**(సశేషం)**

## స్వరాంజలి

# యతిగీతలో సంకెళ్లు



– స్వామి వివేకానంద

మెరిసే బంగారంతో చేసినదైనా
కఠోరమైన నల్లని ఇనుపదైనా
నిన్ను బంధించే సంకెళ్లన్నీ పగలగొట్టక తప్పదు
రాగం, ద్వేషం - మంచీ, చెడూ
ఇవన్నీ ద్వంద్వాలే
ద్వంద్వాలన్నీ బంధాలే
ప్రేమతో ఆదరింపబడినా
కొరడాతో దండింపబడినా
బానిస చిరకాలం బద్ధుడే - బానిసే.
సంకెళ్లు స్వర్ణమయాలైనా
తక్కువగా ఏమీ బంధించవు -
అందుకే - వాటినన్నిటినీ పగులగొట్టి
ధీరసన్యాసీ, పలుకుమా ఓం తత్సత్ అని.

✡ ✡ ✡

తల్లీ తండ్రీ, భార్యాబిడ్డా, మిత్రులూ -
ఈ కలలలో మునిగిన వారికి సత్యం కనరాదు.
ఆత్మ లింగ రహితం - ఇది ఎవరికి తండ్రి? ఎవరికి బిడ్డ?
ఇది సర్వప్రాణి సంచారిణి
ఇదొక్కటే సర్వత్రా విరాజమానం
మిగిలినదంతా మిథ్య,
నీవే ఆత్మవు - అని గ్రహించి
ఓయి ధీరయతీ, పలుకుమా ఓం తత్సత్ అని.

✡ ✡ ✡





మిత్రమా ఎక్కడ నీ వెదుకులాట?
ఈ విశ్వం నీకు స్వతంత్రతను ఇవ్వదు -
గ్రంథాలలో, మందిరాలలో ఎందుకీ అన్వేషణ!
నిన్ను ఈడ్చుకొని పోయే త్రాటి కొస
నీ చేతిలోనే ఉన్నదని గ్రహించు.
వ్యర్థ దుఃఖాలు విడువు, నీ చేతిలో తాడు వదులు
ధీరసన్యాసీ! పలుకుమా ఓం తత్సత్-అని.

## మహిళా సాయిభక్తులకు ప్రత్యేక ఆహ్వానము

గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణములోని బ్రాహ్మణ బజారు చివరగల గాయత్రీ మందిరము (శంకర మఠము)లో **2014 జనవరి నెల 19వ తేదీ ఆదివారము ఉదయము గం.9.00ల నుండి సాయంత్రము గం.5.00ల వరకు రాష్ట్రస్థాయి సాయి మహిళా భక్తుల సమ్మేళనము** జరుగును. కనుక రాష్ట్రములోని సాయి మహిళా భక్తుల నందరినీ యీ సమ్మేళనములో పాల్గొనగోరటమైనది. సమ్మేళనములో పాల్గొనువారు ముందుగా ఈ క్రింది ఫోన్ నెంబర్లలో ఒక నెంబరుకు ఫోన్ చేసి వివరములు తెలుసుకొనుచు, తాము వచ్చు విషయమును తెలిపి పేరు వ్రాయించుకొనగలరు. అలా తెలిపిన సదస్సు సక్రమముగా నిర్వహించుటకు సహకరించిన వారదగుదురు.

**ఫోన్ చేయవలసిన నెంబర్లు :**


**948780696, 08643-236818**

**ఇట్లు**

**ఆలూరి గోపాలరావు గారు**

పొన్నూరు **(శ్రీ షిరిడీ సాయి సత్సంగ సేవా సమితి తరఫున)**

29-11-2013 **మహిళా విభాగము, పొన్నూరు**



# సిద్ధ భూమి

– మాతాజీ

("ఓషో ఉపనిషత్" ఆధారంగా)

ఒక విదేశీయ శిష్యురాలు స్వామీ రజనీష్ (ఓషో)ను ఇలా ప్రశ్నించారు. "స్వామీజీ! ఇక్కడ భారతదేశంలో మీతో కలిసి కూర్చొని ధ్యానం చేసేటపుడు ఎంతో అనాయాసంగా, ప్రశాంతంగా ధ్యానం నిలుస్తుంది. హొటల్ గదిలో కూర్చున్నాగానీ ఎక్కడో వనాంతరాలలో ఉండి ధ్యానిస్తున్నంత ఆనందంగా ఉంటుంది. అదే మీరు మా దేశానికి వచ్చినపుడు లభించదు. కారణం ఏమిటి? ఈ భూమిలో సహజసిద్ధి వంటిదేమైనా ఉన్నదా?"

ఓషో యిలా జవాబిచ్చారు -

"భారతదేశం భూగోళంలోని ఒక భాగమో, చరిత్రో కాదు. ఇది కేవలం ఒక జాతో, కేవలం కాస్త నేలో కాదు. అంతకన్నా చాలా అతీతమైనది. ఓ కావ్యం, ఓ అలంకారం, దృష్టికి అందని అనుభూతి. మరి ఏ యితర దేశానికీ అనుభూతంకాని శక్తి క్షేత్రాలతో ఇది నిండి ఉన్నది. దాదాపు ఏ పదివేల సంవత్సరాల నుండో వేలాదిమంది ప్రజలు జ్ఞానతేజాన్ని అనుభూతం చేసుకున్నారు. వారి జ్ఞాన ప్రకంపనాలు ఇక్కడ ఇంకా సజీవంగా ఉన్నాయి, ఈ గాలిలో వాటి ప్రభావం ఉంది. మీకు దాన్ని స్వీకరించగల స్థాయి ఉండాలి, ఈ విచిత్రభూమిని ఆవరించి ఉన్న ఆ అదృశ్యశక్తిని చూడగల దృష్టి మీలో పెరగాలి - అంతే!

ఒకే ఒక్క అన్వేషణ కోసం మనిషి తన సర్వస్వాన్నీ త్యజించిన విచిత్రభూమి యిది. ఆ అన్వేషణ సత్యం కోసం. ఈ భూమి ప్లేటో, అరిస్టాటిల్, కాంట్, హెగెల్, బ్రాడ్లీ, బెర్ట్రండ్ రస్సెల్‌ల వంటి గొప్పగొప్ప తాత్త్వికులను ఉత్పత్తి చేయలేదు. మొత్తం భారతచరిత్రలో ఒక్కడంటే ఒక్క తాత్త్వికుడు కూడా లేడు-కేవలం సత్యాన్వేషకులు మాత్రమే ఉన్నారు.





ఇతర దేశాలలో జరిగిన అన్వేషణకు యిది పూర్తిగా విభిన్నం. విదేశాలు సత్యం గురించి ఆలోచించాయి. కానీ యీ దేశం ఆలోచించలేదు. సత్యం గురించి ఎలా ఆలోచిస్తారు? నీకు సత్యం తెలియటం, తెలియకపోవటం- అంతేగానీ ఆలోచించటం ఏమిటి? తెలియనీ, తెలియకపోనీ-సత్యం గూర్చి ఆలోచించటమూ, తర్కమూ అన్నవి అసంభవం, అసంబద్ధం, వెర్రి ప్రయత్నం కూడా. గుడ్డివాడు వెలుగు గురించి ఆలోచించినట్లే అది ఉంటుంది. ఏమి ఆలోచించగలడతడు? అతను మేధావి కావచ్చు. గొప్ప తార్కికుడు కావచ్చు-ఏమీ లాభం ఉండదు. కావలసిందల్లా చూడగల కన్నులు-అంటే సవ్యదృష్టి. వెలుగును చూడగలం-ఆలోచించలేం. సత్యాన్ని చూడగలం-ఆలోచించలేం. అందుకే 'ఫిలాసఫీ' అన్నదానికి సమానమైన మాట భారతదేశంలో లేదు. సత్యాన్వేషణను ఇక్కడ దర్శనం అంటాము. దర్శనం అంటే చూడటమే. ఫిలాసఫీ అంటే ఆలోచన. ఆలోచన ఎప్పుడూ మళ్లీ మళ్లీ గుండ్రంగా తిరుగుతుంటుంది. అది ఎన్నటికీ అనుభూతి అన్న కేంద్రబిందువు దగ్గరకు చేరనే లేదు.

మనిషి తన సర్వశక్తులనూ సత్యదర్శనం కోసం, తానే సత్యంగా రూపొందటం కోసం కేంద్రీకృతం చేసిన విచిత్రభూమి యిది. ఇక్కడ గణితం పుట్టింది. మహామేధావులున్నారు. కానీ భౌతిక విషయాల పట్ల పరిశోధనాసక్తి చూపలేదు. ఇక్కడ యితరులను తెలుసుకోవటం కాదు- తనను తాను తెలుసుకోవటమే లక్ష్యం. దాదాపు పదివేల ఏళ్లుగా లక్షల కొద్దీ ప్రజలు వైజ్ఞానిక ప్రగతిని, సాంకేతిక విలువలను, సంపదలను నిర్లక్ష్యంగా నెట్టేసి- పేదరికాన్ని, అనారోగ్యాన్ని, రోగాలను, మరణాన్నీ వరించి మరీ సత్యా న్వేషకులు కావటమేగాదు-ఎట్టి పరిస్థితులలోనూ తమ దీక్షను విడనాడ లేదు. అది ఒకానొక ప్రకంపనా సాగరాన్ని నీ చుట్టూ ప్రవహింపజేస్తోంది.

నీవు ఏ కొద్దిపాటి ధ్యానోన్ముఖమైన మనసుతో యిక్కడికి వచ్చినా

ఆ మహాసాగరంతో అనుబంధం కలుగుతుంది. కేవలం ఏదో (టూరిస్ట్) యాత్రికురాలిగా వస్తే మాత్రం అది నీకు అందదు. ఇక్కడ కేవలం శిథిలాలు, రాజభవనాలు, దేవాలయాలు, తాజ్‌మహల్, ఖజురహో, హిమాలయాలు-యివే చూస్తావుగానీ భారతభూమిని చూడలేవు. ఇండియాను కలుసుకోకుండానే ఇండియా అంతా తిరిగి వెళ్లిపోతావు. ఇక్కడ సర్వే సర్వత్రా వ్యాపించి ఉన్న మహాశక్తిని తెలుసుకోవాలంటే నీకు ఒక స్వీకృతి శక్తి ఉండాలి. అది లేకుండా నీవు దేశమంతా తిరిగినా కేవలం అస్థిపంజరాన్నే చూడగలవు, దాని ఫొటోలతో నీ ఆల్బమ్ నింపుకో గలవు. అంతే. పైగా నేను ఇండియా చూచి వచ్చానన్న ఆత్మవంచనకు లోనవుతావు. ఈ భూమికి ఒక ఆత్మసాధన, ఒక ఆధ్యాత్మిక శక్తి ఉన్నాయి వాటిని నీవు నేర్చిన చదువు, నీ శిక్షణ ఫొటోలలో బంధించలేవు.

నీవు ప్రపంచంలో జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, ఇంగ్లండ్-ఎక్కడికైనా వెళ్లవచ్చు. అక్కడి జనం, చరిత్ర, దాని గతం అన్నీ తెలుసుకోగలవు. భారతదేశాన్ని అలా చూడటం, ఆ దేశాల కోవలోకి లాగటం కుదరదు. ఎందుకంటే ఈ భూమికి ఉన్న ఆధ్యాత్మిక పవిత్రశక్తి వాటికి లేదు గనుక! అవేవీ ఒక కబీరును, ఒక గౌతమబుద్ధుడిని, ఒక మహావీరుని, ఒక నేమినాధుని సృష్టించలేదు. వాళ్లు చాలామంది కవులను, కళాకారులను, ఇంకా అనేక రకాల మేధావులైన నిపుణులను సృష్టించగలిగారు. కానీ సత్యశోధకులైన ఋషుల మీద మాత్రం భారతభూమిదే సర్వాధికారం.

ఋషి అనేవాడు దివ్యత్వం పయనించే ఒక వాహనం. అతడు దివ్యత్వానికి తలుపులు తెరిచి ఆహ్వానించగలడు. అలాంటి వేలాది, లక్షలాది మంది ఋషుల సాధన వలన యీ దేశ వాతావరణంలో దివ్యత్వం నిండిపోయింది. ఆ వాతావరణమే అసలైన భారతదేశం. దాన్ని తెలుసుకోవాలంటే నీ మనసుకొక స్థాయి ఉండాలి. నీవు ధ్యానం చేసే ప్రయత్నంలో ఉన్నపుడు నీ మనసు నిశ్శబ్దంగా ఉంటుంది. అది యీ





దివ్యత్వంతో అనుబంధం పొందుతుంది. ఈ దేశం చాలా పేదదేగానీ దీని ఆధ్యాత్మిక వారసత్వ సంపద చాలా గొప్పది. దాన్ని గ్రహించగలిగితే నీవు చకితుడవవుతావు. ప్రతి దేశానికీ వేలాది విషయాలపై నిష్ఠ ఉండవచ్చు గానీ ఈ నేలకు మాత్రం ఒకే ఒక్క లక్ష్యం ఉంది. మానవుడు క్రమాభివృద్ధి సాధిస్తూ భగవచ్ఛక్తితో ఎక్కడ కలవగలడు. జీవుడినీ పరముడినీ సన్నిహితం చేయటం ఎలా? అనాదికాలంగా - ఇదొక్కటే యిక్కడి ప్రజలు ఏకాగ్రంగా సాధన చేస్తున్న విషయం. అందుకే ప్రపంచంలో ఏ మూల ఎవ్వరు జ్ఞానపిపాసతో సత్యాన్వేషణకు పూనుకొన్నా గానీ- వాళ్ల దృష్టి భారతదేశం వైపు తిరుగుతుంటుంది. పాతిక శతాబ్దాల క్రిందటే పైథాగరస్ ఇక్కడికి వచ్చాడు. ఏసుక్రీస్తు వచ్చాడు.

క్రీస్తు జీవితం గురించి బైబిల్‌లో 13-30 సంవత్సరాల మధ్య ఎటువంటి సమాచారం లేదు. ఆ సమయంలో ఆయన ఎక్కడున్నాడు? ఏమి చేసాడు? 33 సంవత్సరాల వయసులో ఆయనను సిలువ వేసారు. అంత చిన్న జీవితంలో మధ్య పదిహేడు సంవత్సరాల చరిత్రను కావాలని తొక్కిపెట్టారు, వెలికిరానివ్వలేదు. ఎందుకని? ఆయన చెప్తున్నది క్రొత్త మతం కాదనీ, క్రీస్తు దానిని భారతదేశం నుంచీ తీసుకువచ్చాడనీ తెలియకూడదని వారి ఉద్దేశ్యం. ఇది పెద్ద కుట్ర. ఏసు యూదుడిగా జన్మించాడు. యూదుడిగానే మరణించాడు. ఆయన క్రైస్తవుడు కాడు, ఆ మాటెప్పుడూ అనలేదు. అలాంటప్పుడు యూదులు ఆయన పట్ల ఎందుకంత తీవ్ర వ్యతిరేకత చూపించారు? క్రైస్తవులు కూడా దీనికి సమాధానం చెప్పలేరు. ఏసు ఎన్నడూ, ఎవ్వరికీ, ఎట్టి అపకారమూ చెయ్యలేదు. ఆయన నేరం చాలా సూక్ష్మమైనది. యూదు మతవేత్తలకు ఏసు తూర్పు దేశాల వారి భావాలను భరత భూమి నుండీ తెచ్చి ప్రవేశపెడు తున్నాడనీ, అవి యూదు విశ్వాసాలకన్న విభిన్నమైనవనీ అర్థమైంది. అదే ఏసు నేరమన్నారు.

ఈ కోణం గుండా పరిశీలిస్తే ఏసుక్రీస్తు మాటిమాటికీ "పాత ప్రవక్తలు ఎదుటి వారి కోపాన్నీ, ద్వేషాన్నీ దెబ్బకు దెబ్బగా ఎదుర్కోవాలని చెప్పారు. కానీ, నేను చెప్తున్నాను వినండి. ఎవరైనా మీ చెంప మీద కొడితే మరో చెంప చూపించండి"-అని చెప్పటంలోని ఆంతర్యం అర్థమవుతుంది. ఇది పూర్తిగా యూదు జాతి భావాలకు వ్యతిరేకం. క్రీస్తు దీనిని గౌతమబుద్ధుడి బోధల నుంచీ, మహావీరుని బోధల నుంచి నేర్చుకున్నాడు.

గౌతమబుద్ధుని నిర్యాణం తరువాత బౌద్ధమతం చాలాకాలం సజీవంగానే ఉంది. బుద్ధుని బోధామృతం యీ దేశాన్ని ముంచెత్తించి. ప్రేమ, క్షమ, సహానుభూతి వంటి మృదుభావాలు పెనుతుఫానులాగా ప్రజా హృదయాలను లోగొన్నాయి. ఏసుక్రీస్తు వచ్చినప్పటి దేశ స్థితి యిలా ఉంది. ఆయన అవన్నీ యిక్కడే నేర్చుకున్నాడు. "ఈ భావాలన్నీ ప్రాచీన ప్రవక్తలవే" అని ఆయన అన్నాడు. ఎవరా ప్రాచీన ప్రవక్తలు? ఎజెకీల్, ఎలిజా, మోజెస్ మొదలైన యూదు ప్రవక్తలా? వాళ్ల బోధల ప్రకారం "భగవంతుడు చాలా తీవ్రవాది. పొరపాటున కూడా క్షమించడు." బైబిల్ పాత నిబంధన గ్రంథంలో భగవంతుడిలా అంటాడు-"నేను నీ మేన మామను కాను. సాధు వర్తనుణ్ణి కాను. నేను అసూయాపరుణ్ణి- కోపిష్ఠి వాడిని. నాతో కూడిరాని వారంతా నాకు వ్యతిరేకులే అని చెప్తున్నాను" అన్నాడు. మరి, ఏసుక్రీస్తేమో "ప్రేమే భగవంతుడని నేను చెప్తున్నాను" అన్నాడు. ఆయన ఎక్కడ నేర్చుకున్నాడీ మాట? ప్రపంచం మొత్తం మీదా "ప్రేమే దైవం" అన్నవాడు ఒక్క గౌతమబుద్ధుడే. ఇది నిస్సం శయం. దాదాపు పదిహేడేళ్లపాటు ఏసు ఈజిప్టు, భారత్, టిబెట్ మొదలైన చోట్లన్నీ తిరిగి, యిక్కడి సద్భావనలన్నీ గ్రహించి, వాటిని యూదు మతంలో ప్రవేశపెట్టాడు. అవి ఆ జాతి వారికి క్రొత్తవే కాదు-వ్యతిరేకం కూడా.

అసలు ఏసుక్రీస్తు భారతదేశంలోనే మరణించాడు అని వింటే మీరు ఆశ్చర్యపోతారు. కావాలనే యీ అంశాన్ని క్రైస్తవ రికార్డులు తప్పించివేసాయి.





అసలు 'రిసరెక్షన్' అనబడే పునరుజ్జీవం తరువాత క్రీస్తు ఎక్కడికి వెళ్లాడు? ఆయన అంతిమ దినాలు ఎక్కడ గడిచాయి? - ఈ వివరాలేవీ బైబిల్‌లో గానీ, తదితర గ్రంథాలలో గానీ లేవు. నిజానికి "రిసరెక్షన్" అన్నది కూడా సరికాదు. అసలు క్రీస్తు సిలువపై మరణించనే లేదు. యూదుల సిలువ మనిషిని చంపడానికి అతి (క్రూర) తీవ్రమైన శిక్ష. దాని మీద మనిషి చచ్చిపోవడానికి నలభై ఎనిమిది గంటలు పడుతుంది. కాళ్లకు, చేతులకు కొట్టిన మేకుల వల్ల ఏర్పడిన గాయాల నుండీ రక్తం చుక్కచుక్కగా కారి బాగా ఆరోగ్యవంతుడైతే 60 గంటలలోనూ, మామూలు వారైతే 48 గంటల లోనూ మరణిస్తారు. ఏసుక్రీస్తును సిలువ మీద ఉంచింది ఆరు గంటలు మాత్రమే. ఆ కాస్త సమయం అలా ఎవరినీ చంపదు, చంపలేదు.

ఇది పాంటియస్ పిలేట్ కుట్ర. (అతన్ని తెలుగులో 'పిలాతు' అంటారు). ఆయన యూదుడు కాడు. రోమన్ వైస్రాయ్. ఆ కాలంలో 'జూడా' (యూదు రాజ్యం) రోమన్ల పరిపాలనలో ఉంది. పిలేట్‌కు ఏసును చంపటం ఇష్టం లేదు. ఈ క్రూరమైన అసహ్యపు హత్యలో భాగస్వామ్యం వహించటం అతనికి ఏదో నేరం చేసినట్లుగా ఉంది. ఈ నిర్దోషి అయిన యువకుడిని తన సంతకం లేకుండా వాళ్లు చంపలేరు. కానీ దాదాపు యూదులందరికీ అతన్ని సిలువ వెయ్యాలనే ఉంది. కాబట్టి యిది రాజకీయ సమస్య అవుతుంది. క్రీస్తును విడిచిపెడితే మొత్తం యూదా రాజ్యానికే తాను శత్రువవుతాడు. అది రాజనీతి కాదు. కానీ యితన్ని శిక్షిస్తే తన అంతరాత్మ గాయపడుతుంది, క్షోభిస్తుంది. రాజకీయ పరిస్థితులకు లోనై ఒక అమాయకుడిని చంపటమా!

అలా ఆలోచించిన పిలేట్ శుక్రవారంనాడు క్రీస్తును సిలువ వేయటం బాగా ఆలస్యం చేయమని తన శిష్యులకు చెప్పాడు. శుక్రవారం సాయంత్రం సూర్యుడు అస్తమిస్తే యూదులెవ్వరూ ఏ పనీ చేయరు. శనివారం వారికి పవిత్రదినం. గనుక ఏ పనీ చెయ్యరు. శుక్రవారం ఉదయం జరగవలసిన

సిలువ వేసే కార్యక్రమం పిలేట్ శిష్యుల వలన ఆలస్యమైంది. అధికార యంత్రాంగం చెయ్యలేనిది ఏముంది గనుక!

క్రీస్తు మధ్యాహ్నం సిలువ వేయబడ్డాడు. సూర్యాస్తమయానికి ముందరే అతన్ని స్పృహలేని స్థితిలో (రక్తం చాలా పోయిన కారణంతో నీరసించి స్పృహ తప్పిపోయాడు) దించేసారు. తమ సెలవుదినం శనివారం అయ్యాక తిరిగి సిలువ వేస్తారన్నమాట. ఆయన్ను ఒక గుహలో ఉంచి కాపలా వాడిని నియమించారు. అతడు రోమన్. అందుచేత ఏసుశిష్యులకు ఆయన్ను తప్పించటం తేలికైంది. మరి ఏసుక్రీస్తు మళ్లీ భారతదేశానికి ఎందుకు వచ్చాడు? అతడు అంతకుముందు యవ్వనంలో భారతీయ ఆధ్యాత్మికతను చవిచూచాడు. ఇక్కడి దివ్యత్వం అతన్ని మళ్లీ యిక్కడికి ఆకర్షించింది. ఆయన యిక్కడే నూట పన్నెండు సంవత్సరాల వయస్సు వచ్చే వరకూ జీవించారు. ఆయన సమాధి కాశ్మీర దేశంలో యింకా ఉంది. దాని మీద హిబ్రూ భాషలో యిలా చెక్కి ఉంది -

"జోషువా-(హీబ్రూ భాషలో ఏసు పేరిది) ఇక్కడికి వచ్చారు. ఆయన చాలా గొప్ప గురువు. తన శిష్యులతో కలిసి వచ్చి, మౌనంతో జీవించారిక్కడ చాలాకాలం - నూట ఇరవై ఏళ్లు వచ్చేదాకా. ఆయన తనను 'గొర్రెల కాపరి' అని చెప్పకొనేవారు".

ఇప్పటికీ ఆ గ్రామాన్ని 'గొర్రెలకాపరి పల్లె" అంటారు. అది యింకా ఉంది. ఇప్పడు దాని పేరు "పహల్గాఁవ్" (అంటే గొర్రెల కాపరి ఊరని అర్థం.) ఏసు ఇక్కడే తనతో ఉన్న కొద్దిపాటి శిష్యులకు కూడా ఆత్మోన్నతిని ప్రసాదిస్తూ జీవించదలుచుకున్నాడు-ఇక్కడే మరణించదలచుకున్నాడు కూడా. ఎంచేతనంటే జీవించటం నేర్చుకొన్నవాడికి యిక్కడ బ్రతకటం ఎంత సుందరమో-మరణించదలచిన వారికి యిక్కడ మృతి చెందటం కూడా అంత సురందరమూను! ఒక్క భారతదేశంలోనే జీవనమూ, మృతీ కూడా గొప్ప కళాత్మకంగా పరిశోధింపబడ్డాయి.

ఇంకో ఆశ్చర్యకరమైన సంగతేమిటంటే మోజెస్ సమాధి కూడా యిదే





చోట ఉంది. బహుశః ఏసు గొప్ప గురువైన మోజెస్ సమాధి దగ్గరే తనది కూడా ఉండాలనుకున్నాడేమో! మరి, మోజెస్ కాశ్మీర్‌లో ఎందుకు చనిపోయాడు? మోజెస్ తన యూదు జాతీయులందరినీ భగవంతుని భూమి అయిన ఇజ్రాయెల్‌కు తీసుకువెళతానని ఈజిప్ట్ బయటికి తెచ్చాడు. ఆ యాత్ర నలభై సంవత్సరాలు సాగింది (ఇజ్రాయెల్ చేరేటప్పటికి). మోజెస్ సమకాలికులు దాదాపుగా అందరూ మరణించారు. వారి సంతతి యువకులైనారు. "ఇదే భగవంతుడు మన కోసం ఉంచిన భూమి. దీన్ని మీరు ప్రశాంతంగా పాలించుకోండి. సుఖంగా దైవచింతనతో జీవించండి" అని వారిని ఆదేశించి, తాను ఎటో వెళ్లిపోయాడు. మోజెస్ ఎక్కడికి వెళ్లాడు? భారతదేశానికి. మోజెస్ అంత్యకాలంగురించిగానీ, మృతిని గూర్చిగానీ, క్రైస్తవ రికార్డుల్లో ఎక్కడా లేదు. ఆయన సమాధి కాశ్మీరంలో-హీబ్రూ భాషలో ఆయన పేరు, వివరాలు చెక్కి మరీ ఉన్నది. ఆయన ఆనాటి మహద్గురువు. ఎక్కడ దివ్యత్వపు శక్తి తరంగాలుగా, ప్రవాహాలుగా ఆ వాతావరణం అంతటినీ పవిత్రం చేస్తూ మహత్తరం చేస్తుందో ఆ సిద్ధభూమిలో ఆ శక్తిని స్వీకరిస్తూ మరణించటమే చాలు-అది ముక్తిప్రదం. ఆ రహస్యం తెలిసే యీ గడ్డ మీదికి శతాబ్దాలుగా సాధకులు వస్తూనే ఉన్నారు. ఈ దేశం పేదది. ఎవ్వరికీ భౌతిక సంపద యివ్వలేదు. కానీ సూక్ష్మగ్రహణ శక్తి గలిగిన వారికి ఎవ్వరికైనా యిది ప్రపంచంలోకెల్లా అత్యంత సంపన్నమైన భూమి. ఆ సంపత్తి ఆంతర్యమైనట్టిది. (అయితే మోజెస్ భారతదేశమే ఎందుకు వచ్చారన్నది ప్రశ్న). ఆయన సమాధినీ, క్రీస్తు సమాధినీ పహల్గాఁవ్‌లోని ఒక యూదు కుటుంబం తరతరాలుగా పరంపరగా కాపాడుతూ వస్తోంది.

లతీఫా, నీవు రైటే. నీ హృదయాన్ని మరింతగా ప్రశాంతంగా ఉంచుకో. మరింత ప్రశాంత చిత్తంతో నీలో జరిగే ఉన్నతిని గమనిస్తూ ఉండు. ఈ నిరుపేద దేశం మానవులకు అందుబాటులోకి రాగల అద్భుత సంపదలు నీకు అందించగలదు.

# మాతృసంస్థ కబుర్లు

నవంబరు 12వ తేదీ ఉదయమే స్వామివారి కారు సాయినాథ క్షేత్రం వైపు సాగింది. త్రోవలో దామరచర్ల శేఖర్ గారింటి దగ్గర కొద్ది నిముషాలు ఆగి పలకరించి మిరియాలగూడా రోడ్డు మీదకి వచ్చిన చి॥ సీతారామయ్యను పలకరించి, మధ్యాహ్నానికి సత్తెనపల్లి చేరుకొన్నాము. శ్రీరామదర్శనం చేసుకొని, సాయినాథుల వారి దేవాలయ నిర్మాణాన్ని పర్యవేక్షించారు గురుదేవులు. అటుపైన మా వెంట తీసుకువెళ్లిన కేరియర్లు ఖాళీ చేసి ప్రయాణం కొనసాగించాము. సాయంత్రం నాలుగున్నరకు తెనాలి చేరుకొన్నాము. వంతెన మీద సిద్ధంగా ఉన్నాడు గోపీకృష్ణ. వాళ్ల యింటికి తీసుకువెళ్లాడు. అతని తల్లిదండ్రులు, భార్యాపిల్లలు, ఒకరిద్దరు మిత్రులతో ఒక గంటసేపు సద్విషయ చర్చ జరిగాక వారి ఆతిథ్యం స్వీకరించి, తిరిగి ప్రయాణం కొనసాగించాము. రాత్రి ఏడు గంటల కల్లా చేరవలసిన వాళ్లం- మన మహాఘనత వహించిన ప్రభుత్వం వారు రోడ్లు బాగు చేయాలనే ఉద్దేశ్యంతో మొత్తం తవ్విపోసి, కంకర చల్లేసి (పరిచికాదు-చల్లి) ఇంకా రోలర్ తిప్పని కాలవగట్టు మీది నుంచీ ప్రాణాలు గుప్పిటబెట్టుకొని- కాలవలో మరీ నిండా నీళ్లు లేనందుకు సంతోషిస్తూ- అటూ యిటూ ఒరిగి పడినప్పుడు కలుక్కుమనే నడుములు సరిచేసు కొంటూ-హాయిగా విమానం కొనుక్కోలేని పేదరికానికి చింతిస్తూ-ఒకవేళ కొనుక్కో గలిగినా డైరెక్ట్‌గా కృష్ణానదిలో దిగవలసిందే తప్ప వేరు గతిలేదు గదా అని విచారిస్తూ-చచ్చీచెడీ శాయంగల విన్నపాలై-ఎనిమిదింటికి మూర్తోట రోడ్డెక్కి-రెండువైపులా పెరిగిన సర్కారు తుమ్మకొమ్మలు కిటికీ తెరిస్తే మా ముఖాలతో, మూస్తే కారుతో సరసాలాడుతూ గీరుతుండగా- ఎలాగో అలాగ సాయినాథ క్షేత్రానికి చేరుకున్నాము. దిగీ దిగగానే





గురువుగారు చేసిన మొదటి పని-"రేపు ప్రొద్దున్నే వెళ్లి ఆ కట్ట మీదికి ఒరిగిన తుమ్మకొమ్మలన్నీ కొట్టెయ్యండి. ఎవరి బళ్లయినా పాడైపోతాయి గదా! పనయ్యాక వచ్చి మూడు వందలిస్తాను-తీసుకువెళ్లండి" అని ఏలియాకు, భిక్షాలుకు చెప్పటం అది యోగి హృదయం మరి!

మరునాటి ఉదయం శ్రీమతి సుంకర శారదమ్మగారికి కలిగిన సంతాపానికి ఆమెను కలిసి కొంతసేపు సద్వాక్యప్రదానం చేసారు గురుదేవులు. వారి కుటుంబమంతా కూడా ఎంతో హుందాగా తమకు కలిగిన బాధను స్వీకరించటం, శారదక్కయ్య యీ దశలో కూడా తాత్త్విక దృష్టితో ఉండటం చాలా ఆనందాన్ని కలిగించింది. వారిని వీడ్కొని తిరిగి ఆశ్రమానికి చేరుకున్నాం. గురుదేవులను అక్కడ దింపి మిగిలిన వాళ్లు రేపల్లె తుళ్లూరి సోమశేఖరరావుగారి యింటికి వెళ్లి వారి తండ్రిగారి మృతితో చింతిస్తున్న తల్లిగారిని, తదితరులను పరామర్శించారు. ఆశ్రమ బంధువులు పుట్టగుంట మంజువాణి, సత్యవాణి, గౌతమబుద్ధలను చూచి, వారి ఆతిథ్యం స్వీకరించారు. సాయంత్రానికి తిరిగి ఆశ్రమానికి చేరుకొన్నారు. ఆ సాయంత్రం నల్లూరు గ్రామంలోని హరిజనవాడలో అయ్యప్పదీక్ష తీసుకున్న కొందరు భక్తుల కోరికపై గురుదేవులు సత్సంగం నిర్వహించారు. గ్రామీణులు శ్రద్ధాళువులై వచ్చి కూర్చున్నారు. వారు కొత్తగా దీక్ష తీసుకోవటం చేత భజనలూ అవీ కూడా రావు. కానీ, తమకు భజన నేర్పడానికీ, పూజలలో భజన చేయడానికీ కూడా నెల్లూరువారిపాలెం అనే గ్రామం నుంచీ కొందరు భజన సమాజంవారిని పిలుచుకున్నారు. వారు చక్కని భజనలు వినిపించారు. చిన్నరామ మందిరంలో సమావేశం జరిగింది. గురుదేవులు వారికి దీక్ష అంటే ఏమిటో, దాన్ని ఎలా నిర్వహించుకోవాలో వివరించి, వారి దీక్ష నిర్విఘ్నంగా సాగాలని ఆశీర్వదించారు. మాతాజీ అక్కడి స్త్రీలనుద్దేశించి సంప్రదాయసిద్ధంగా అర్థవంతంగా పండుగలు చేసుకోవటం, హిందూ ధర్మ విశిష్ట లక్షణాలను

నిలుపుకోవటం తమ పిల్లలకు అలవాటు చేయమనీ, తద్వారా తమ పిల్లలు ధర్మం తప్పరనీ ప్రబోధించారు. తదుపరి ప్రసాదవితరణతో సమావేశం ముగిసింది. ఆ పేద పల్లీయులు చూపిన శ్రద్ధకు ఆనందించి, వారికి వెయ్యి రూపాయలు ఆర్థిక సహకారం అందించిన రామకోటేశ్వరరావుగారు అభినందనీయులు.

మరునాడు క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా క్షేత్రంలోని 'సర్వతోభద్ర' సాయి దేవాలయంలో విశేషపూజలు జరిగాయి. అటుపైన పదిన్నర గంటల వేళ-ప్రాంగణంలోని ఉసిరిచెట్టు క్రింద తులసీమాతకు పూజ జరిగింది. దాదాపు అరవై అయిదుగురు ముత్తైదువలు చెట్టు చుట్టూ కూర్చొని కన్నుల పండువుగా పూజ చేసుకున్నారు. ఉన్నంతలో అందమైన బట్టలు, అలంకారాలు, తలలో పువ్వులు, నుదుట కుంకుమ, చెక్కిళ్ల గంధం, కాళ్లకు పసుపు, ఏదో ఒక ఉత్సాహం ఆనందంతో నిండిన ముఖాలు-భక్తరాండ్రతో పూజాస్థలం కళకళలాడిపోయింది. ఇంతటి సమైక్య సంతోషాన్ని చేజేతులా పోగొట్టుకొంటున్న (ధర్మం మారిపోయిన) వారి గురించి ఒక్క క్షణం బాధ కలిగింది. చెట్టు చుట్టూ దీపాల తోరణాలు వెలిగాయి. శాస్త్రోక్తంగా పూజ జరిగాక ముత్తైదువలంతా ప్రదక్షిణ నమస్కారాలు చేసుకున్నారు. తమ సౌభాగ్యం కలకాలం పచ్చగా ఉండాలని ప్రార్థించుకున్నారు. అంతకు ముందే గురుదేవులు జలంధరుడు-తులసి అనే మాటలకు అర్థాన్నీ, ఆ తులసీ జలంధరుల కథ వెనుక గల అంతరార్థాన్నీ వివరించి చెప్పారు గనుక- అది విన్న వారికి యీ పూజ మరింత ఆనందాన్ని కలిగించింది. మధ్యాహ్నం అయింది. సాయికి హారతులిచ్చాక రెండు వందలకుపైగా భక్తులు భోజనప్రసాదం స్వీకరించారు. ఈ అన్నప్రసాద వితరణంతా శారదక్కయ్యగారి తరఫున ఏర్పాటు చేయబడింది. "కష్టనష్టాలు మనుష్యులవి. జరుగవలసిన కార్యం దేవు(డిది. కనుక, అనుకున్నది ఆగడానికి వీలులేదు'-ఈ దృఢనిశ్చయంతో తన దుఃఖాన్ని పక్కనబెట్టి





దైవకార్యంలో తన వంతు పాత్ర నిర్వహించి శారదక్కయ్య తన స్థితప్రజ్ఞత్వాన్ని ఋజువు చేసుకున్నారు.

ఆ రాత్రి యథాప్రకారం ఆశ్రమంలో సత్సంగం జరిగింది-ప్రధానంగా బాలబాలికలతో భజనలు, స్తోత్రాలు, కథలు, చిట్టిచిట్టి బోధలతో సత్సంగం రాత్రి తొమ్మిది గంటలకు ముగిసింది.

15వ తేదీ ఉదయం తెనాలి ప్రయాణం. ఉదయం శ్రీ సాయివర ప్రసాదరావుగారింట చిన్న సమావేశం. పదకొండున్నర వరకూ అనేక విషయాలపై విచారణ సాగింది. అల్పాహారాదులూ అక్కడే ముగిసాయి. ఈ లోపల శ్రీ మైనేని గంగాధరరావుగారు వచ్చి తమ యింటికి తీసుకు వెళ్లారు. అక్కడ వారి చిరకాల వాంఛ అయిన సాయిపూజ రాముతో చేయించుకొని సంతృప్తులైనారు. పూజ ఎంతో అందంగా, ఆనందకరంగా అనిపించింది. ఇరుగుపొరుగు వారంతా వచ్చి, గురుదేవులకు నమస్కారం చేసుకొని ఆశీస్సులు తీసుకున్నారు. గృహస్థులు వారందరికీ ప్రసాదవితరణ, ఫలప్రదానం, స్త్రీలకు పసుపుకుంకుమలివ్వటం కూడా జరిగింది. తదుపరి మా బృందానికి భోజనాలు వడ్డించారు. గంగాధరరావుగారి కుమారుడు శ్రీనివాసు, కోడలు సునీత, కుమార్తె అన్నపూర్ణ కూడా గురుదేవులకు కావలసినవన్నీ ఎంతో శ్రద్ధగా చూచుకొన్నారు. ఈలోపల విజయవాడ నుండీ డాక్టర్ ఝాన్సీ, రేపల్లె నుంచీ విజయలక్ష్మి, గోపీకృష్ణ వచ్చి మాతో కలిసారు. అలాఅలా సాయంత్రమైంది.

మాతాజీ ఓ ఇరవైమంది పిల్లలను దొరకబుచ్చుకొని, వాళ్లకు ఓ శ్లోకం నేర్పి, ఓ కథ చెప్పి, తల్లితో ఎలా మసలుకోవాలో, దానికి కారణమేమిటో వివరించి చెప్పి, కొన్ని ఆటలు ఆడించి, చిన్నపాటి బాలసత్సంగం నిర్వహించారు. అటుపైన అయిదుగంటలకు ఆ ఎన్‌క్లేవ్ క్రింద ఏర్పాటు చేసిన సభాస్థలిలో శ్రీ సాయి సత్సంగం ప్రారంభమైంది. మొదట పూజా కార్యక్రమం-సంస్థా పరిచయం పూర్తయ్యాక గురుదేవుల ప్రవచనం ప్రారంభమైంది.

గురుదేవులు శ్రీ సాయి అవతార రహస్యం వివరించారు. వారి కార్య సంహారకార్యం గాక సంస్కార కార్యమనీ, వారి బోధలు గీతాసారమనీ చెప్పారు. త్రిమూర్తిస్వరూపుడు గనుకనే తమ మృత్యుంజయత్వాన్నీ, గంగా జనకత్వాన్నీ ఋజువు చెయ్యగలిగారనీ అంతటి స్వామి మనకు దొరికితే ప్రక్కచూపులు చూడకూడదని హితవు చెప్పారు. మనిషికి సత్యం స్పష్టంగా తెలిసినాగానీ మాయలో పడుతుంటాడనీ, ఆ మాయనే ఆనందంగా భ్రమిస్తుంటాడనీ చెప్తూ ఉదాహరణగా పందీంద్రుని కథ చెప్పారు. నిరంతర నామస్మరణతో, పారాయణతో సాయిని మనసులో నింపుకోవాలన్నారు.

మన జీవితాలను సాయి బోధనలకు అనుగుణంగా మలుచుకొంటూ, సాటి జీవులలో సాయిని చూచి, అవసరమైన సేవలు అందిస్తూ, ధన్యులు కావాలన్నారు. అలాటి ధన్యత అక్కడున్న వారందరికీ కలగాలని ఆశీర్వ దించారు. స్వామీజీ ప్రవచనం అందరినీ ఆకట్టుకొన్నది.

తదనంతరం శ్రీ శంకరరెడ్డిగారు భగవద్గీత గురించి పది నిముషాల పాటు ఉపన్యసించారు. ఇక గురువుగారికి వీడ్కోలివ్వాలి గంగాధరరావు గారి దంపతులు. గంగాధరరావుగారు విశ్రాంత ఇంజనీయర్. ఎంతో జీవితాన్ని, ఎందరో గురుదేవులను చూచినవారు. కానీ, గురుదేవుల సాన్నిధ్యం, అత్యంత సరళమైన వారి ప్రవర్తన తీరు, గంగాధరరావుగారు, నిర్మలగార్ల మీద తెలియని ప్రభావం చూపించింది. వారి లోలోపల ఏదో కరిగిపోయే లాగా చేసింది. వారు గురుదేవుల పాదాలకు నమస్కరించి మాలోటు ఏమైనా ఉంటే మన్నించండి" అంటూనే కరిగి కన్నీరైపోయారు. నిర్మలగారైతే మరీ చలించిపోయారు. 'ఇదంతా నిజమా, కలా అన్పిస్తోంది నాకు. మా యింట స్వామీజీ అడుగుపెట్టటం, ఇంత చక్కగా సభ జరగటం-యింత అదృష్టమా అనిపిస్తోంది" అని కన్నీరు పెట్టుకొన్నారు. త్రోవలో తిన డానికి అల్పాహారంతో సహా ఏర్పాటు చేసి స్వామీజీ బృందాన్ని అంతటినీ నూతన వస్త్రాలతో, దక్షిణతో సత్కరించారు. (అంతటికీ ఎందకూ సత్కారం





అంటారా? శివపూజలో పూలు వాడారు-అందులో ఒక చీమ ఉంది. అది కూడా శివుడి ముందే కూర్చొని పూజ స్వీకరిస్తుంది గదా!-అలాగన్న మాట అందరికీ సత్కారం) వారి అభిమానపూర్వకమైన వీడ్కోలు స్వీకరించి కారెక్కాము.

ఎంతో శ్రద్ధగా వేదిక, అలంకరణ, ప్రసాదాలు-ప్రతిదీ చక్కగా ఏర్పాటు చేసి, తమతోపాటు పదిమందికీ స్వామి దర్శనం, బోధనం దొరకాలన్న తపన చూపించిన శ్రీ గంగాధరరావుగారు అభినందనీయులు. వారి యీ సమావేశం వలన శ్రీమతి భారతమ్మగారి సత్సంగ బృందం, శ్రీమతి సులోచన, మాధురి, ఝాన్సీవంటి అభిమానులకు, ఐతానగరం సాయి దేవాలయ నిర్వాహకులకు, తదితర స్థానిక అభిమానులకు కూడా స్వామీజీ దర్శన, సంభాషణాదులకు అవకాశం దొరికింది. శ్రీ సాయి నాథుల వారు శ్రీ గంగాధరరావు దంపతులకు ఇతోఽధిక సుజ్ఞానాన్ని ప్రసాదింతురు గాక! అచిరకాలంలోనే చి॥ శ్రీనివాస్‌కు మంచి ఆరోగ్యాన్నీ సత్సంతానాన్నీ ప్రసాదింతురు గాక! అని మా మనఃపూర్వక ప్రార్థన.

రాత్రి ఒకటిన్నరకు ఆశ్రమానికి చేరుకోగానే కారు శబ్దానికి లేచి ఎదురువచ్చారు పిల్లలు. ఇక మాలోకంలో పడిపోయాము.

నవంబరు 25వ తేదీ సాయిధామంలో బాలోత్సవం. ఏటా పిల్లలందరికీ సామూహికంగా జన్మదిన వేడుకలాగా ఉత్సవం చెయ్యటం సాయిధామా నికి అలవాటే. అలాగే యీ ఏడు కూడా ముఖ్యులైన మెంబర్లు, అభిమానుల మధ్య యీ వేడుక జరిగింది. కొందరు అముఖ్యులుంటారని కాదుగానీ చాలామంది ఆశ్రమానికి గురువుగారి కోసం, బాబాకోసం వస్తారు. వాళ్లలో కొందరు పిల్లలను పలకరించే ప్రయత్నం కూడా చెయ్యరు కనీసం. కొందరు మాత్రం పిల్లలతో ఓ అరగంటో, గంటో గడిపి, వాళ్లతో ఆడో, ఓ పాట నేర్పో కాస్సేపు గడిపి వెడతారు. వాళ్ళకింకేం కావాలో ఆలోచిస్తారు. అలాటి వారు పిల్లలకు ఇంకాస్త ముఖ్యులు గదా!-అదీ సంగతి

అలాంటి వాళ్లంతా ఉదయం పదిగంటలకల్లా సాయిధామం ఆడిటోరియం సాయికళ్యాణికి చేరు కున్నారు. సోమవారం వర్కింగ్‌డే కావడంతో కొంతమంది రాలేకపోయినా చాలామంది సెలవులు పెట్టి మరీ వచ్చారు. విశాఖపట్టణం నుంచీ జయక్క ముందస్తుగా వచ్చింది. ఇప్పుడు పెరిగి పెద్దవారైన గీతా, మంజుల వాళ్ల బాల్యంలో వాళ్లకు పనులు, పాఠాలు కూడా నేర్పిన విజయలక్ష్మి అక్కయ్య, పద్మజక్కయ్యలతోసహా-వాళ్లకు పాటలు నేర్పిన రాజగోపాలరావుగారు, దేవీ కృష్ణగారు, భజనలు నేర్పిన గడ్డం నరసింహారెడ్డి తాతయ్యగారు, వాళ్లకు బోలెడన్ని కబుర్లు, లేప్‌టాప్‌లో వింతలు విడ్డూరాలు చూపించే లలితక్క, సత్యం అన్నయ్య, పిల్లలకు ప్రాణం పెట్టే బ్రహ్మారెడ్డి క్షేత్రానికి వెళ్లిన దగ్గరి నుండీ రకరకాల టిఫిన్లు మేపే శారదమ్మమ్మ, అబ్బో లిస్ట్ మరీ పెద్దదైపోతోంది! సత్యనారాయణపురం, డిఫెన్స్ కాలనీ, భాస్కరపురం వగైరా సత్సంగ కేంద్రాలనుంచీ వచ్చిన ఆప్తులు, తదితరులు అంతా సమావేశమయ్యాక చిన్నారుల చేత దీపప్రజ్వలన చేయబడింది గురుదేవుల ఆశీస్సులతో. వచ్చిన వారందరికీ స్వాగతం పలికాడు రాంబాబు. పిల్లలంతా తమ పేరు, చదివే తరగతి, తమ జీవన ధ్యేయాలను గురించి పరిచయాలు చెప్పకున్నారు అందరూ. "చిన్నప్పటినుండీ ఇక్కడే పెరిగాము" అని చెప్తే చైత్రలక్ష్మి మాత్రం "నేను చిన్నప్పటి నుండీ మా అమ్మ ఒడిలోనే పెరిగాను" అని కమ్మని తెలుగులో అనటం విశేషం. తరువాత పిల్లలందరూ కలిసి "ఓ సర్వలోకేశ ఓ దేవదేవ" "ఏ మాలిక్ తేరే బందేహమ్" అన్న ప్రార్థన పాటలు పాడారు.

చి॥ చైత్రలక్ష్మి పరమపూజ్య గురుదేవులకు పాదాభివందనం, మాతాజీ గారికి ప్రేమాభివందనం, అతిథులందరికీ స్వాగత చందనం సమర్పించింది (ఇవన్నీ ఆమె ఉపన్యాసంలోనివే) తమ ఫ్రెండ్సందరికీ ఒక అమ్మమ్మ, తాతయ్య, ఒక పిన్ని-బాబాయి, ఒక మామయ్య-అత్తయ్య అలాగే ఉంటారనీ, తమకు మాత్రం బోలెడంతమంది తాతయ్యలు, ఎందరో





అమ్మమ్మలు, ఎందరెందరో మామలు, అత్తలు, ఇంకెందరో పెద్దమ్మలు-పిన్నమ్మలు ఉంటారనీ, వీళ్లందరినీ తమకు ప్రసాదించిన బాబాకు నమస్కరిస్తున్నాననీ చెప్పింది. తాము చిన్నపిల్లలు గనుక ఏవో కోతిచేష్టలు, మొండిపనులు చేస్తుంటామనీ, ఎదురుజవాబులిస్తామనీ, వాటన్నిటినీ క్షమించి అక్కయ్యలు, అన్నయ్యలు, పెద్దలు తమను గుండెలకు హత్తుకొని పెంచుతున్నారని చెప్పింది. "వాళ్ల వెనుక మీరందరూ ఉన్నారు. మీ వెనుక గురువుగారున్నారు. వారి వెనుక సాయిబాబా ఉన్నారు. ఆయనకు అందరం కలిసి నమస్కారం చెప్పదాం" అంటూ సాయికి జేజేలు పలికించింది అందరితో.

(మా చిట్టితల్లి సుధీరకు జ్వరం రావటంతో పాపం-దాని డాన్స్ చెయ్య లేకపోయింది) పిల్లలంతా కలిసి భగవద్గీతలోని కర్మయోగాన్ని శ్రావ్యంగా వల్లించారు. అటుపైన నందు, అమ్ములు, మంజుల కలిసి నాదు జన్మభూమి కన్న నాకమెక్కడుందీ సురలోక మెక్కడుందీ- అనే దేశభక్తి గేయం ఆలపించారు. తదుపరి నందు వివేకానందస్వామి అంత తాను కావాలంటే త్యాగం, దానం, అన్వేషణ, అనంతంగా చదవటం, పెద్దలు, గురువుల పట్ల తాను ఎలా మసలుకోవాలి, దేశభక్తి, ప్రేమ వగైరాలు ఎలా నేర్చుకొంటాడో వివరించాడు. తాను ఆ మహనీయునంత కాకపోయినా ఆయన శిష్య పరమాణువుగా ఎదగగలిగినా తన జన్మ ధన్యమవుతుందనీ ఆ దిశగా తాను ఎదిగే ప్రయత్నం చేస్తాననీ అన్నాడు.

"కొంటె కోణంగులు" చిట్టి హాస్య లఘునాటికను చి॥ వాసు జ్ఞానేశ్వర్, రామానుజం వేసి అందరినీ నవ్వించారు. తదుపరి పిల్లలంతా కలిసి "అయిగిరి నందిని ..... " అనే మహిషాసుర మర్దినీ స్తోత్రానికి కోలాట ప్రదర్శన చక్కగా చేసారు. తరువాత తమకదినేర్పిన శ్రీ హరి సత్సంగం వారికి కృతజ్ఞత చెప్పకొన్నారు. ఈ సాంస్కృతిక కార్యక్రమం కాగానే మాతాజీ యీ బాలోత్సవం వైశిష్ట్యాన్ని చెప్పి, తాము ఇక్కడికెందుకు వచ్చారో

వివరించారు. ఒకరికొకరు తెలియకుండాపోయే కార్యకర్తలందరినీ ఒక్కచోట చేర్చి, పాత పరిచయాలు పునరుద్ధరించుకోవటం, క్రొత్త పరిచయాలు చేసుకోవటం అన్నది ఈ బాలోత్సవానికి రెండవ పార్శ్వమని వివరించారు.

అటుపైన "సౌమనస్య సత్సంగ' కన్వీనరు శ్రీమతి కన్యక బాబాకు దూరంగా వెళ్లిన తమను మళ్లీ దగ్గరకు లాక్కోవడానికే యిక్కడికి రప్పించారంటూ చాలా చక్కని స్పందనతో మాట్లాడారు. సైనిక్‌పురి శాఖ శ్రీమతి హైమావతిగారు గురుదేవులతో తమకున్న అనుబంధాన్నీ, తమను మృత్యుముఖం నుంచీ గురుదేవులు కరుణతో కాపాడిన వైనాన్నీ వివరిస్తూ ఎంతో ఉద్వేగంతో కరిగిపోయే హృదయంతో మాట్లాడారు. మూడు చింతలపల్లె గ్రామవాసి శ్రీ సదాశివరెడ్డిగారు గురుదేవులు తమ ఊరిలో ఎలా ఆధ్యాత్మిక ప్రగతికి మార్గోపదేశం చేసిందీ వివరిస్తూ గురుదేవులకు కృతజ్ఞతలు తెలుపుకొన్నారు. తరువాత శ్రీమతి దేవీకృష్ణ, శ్రీ రాజగోపాలరావు, శ్రీ నరసింహారెడ్డిగారలు కమ్మని పాటలతో వీనులవిందు చేసారు. బ్రహ్మారెడ్డి మామయ్య, పద్మజక్కగారి చిన్మయి తెచ్చిన కేకు కోసాక పిల్లలందరూ గురుదేవుల ఆశీస్సులందుకొని, తమ విద్యా గురువులయిన శ్రీ సాయి విద్యాధామం ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయ బృందం అంతటినీ నూతన వస్త్రాలతో, ఫలపుష్పాలతో సత్కరించుకొన్నారు. భక్తులందరూ గురుదేవులకు ప్రణమిల్లి ఆశీస్సులందుకొన్న తరువాత అందరూ భోజనాలకు లేచారు. ఆ రోజు పిల్లలకు శ్రమ కలగకూడదన్న సంకల్పంతో ప్రత్యేకంగా గరిట పట్టుకొన్న మా అరవిందాక్షన్ నాయర్‌గారు మొత్తం ఖర్చుకూడా తామే భరించి, షడ్రసోపేతమైన భోజనాలు వండి వడ్డించారు. కాస్సేపు ఇష్టాగోష్ఠి తరువాత మిత్రులంతా వెళ్లిపోయారు. అప్పటికి మూడున్నరైంది. ఇక ఆపై కథ మామూలే. మిగిలిన పదార్థాలన్నీ అంకిరెడ్డిపల్లెలో రాళ్లుగొట్టే శ్రామికులకు పంచిరావటం, వీరావేశంతో ఆ పెద పే.....ద్ద దెయ్యం గిన్నెలన్నీ సామూహిక మార్జన కార్యక్రమంతో శుభ్రం చేసి బోర్లించేసి 'హమ్మయ్య' అనుకోవటం.

నవంబరు 28వ తేదీ ఉదయం బయలుదేరి గురుదేవులు మిరియాలగూడలోని శ్రీ దత్త ఆశ్రమంలో త్రోవతప్పిన హిందూ మిత్రులు స్వధర్మంలోకి పునరాగమనం చేస్తున్న సందర్భంలో జరిగిన సమావేశానికి వెళ్లారు. అనుకొన్న వేళకన్నా (విశ్వహిందూ పరిషత్ వారి) సభ బాగా ఆలస్యంగా ఏర్పాటైన కారణంగా సాయి దేవాలయంలో హారతిలో పాల్గొని అక్కడి భక్తులకు ఆశీస్సులందించారు గురుదేవులు. తదుపరి సభలో పునరాగమనం చేస్తున్న హిందువులను ఆశీర్వదించి, దేశకాల పాత్రలకు అతీతమైన ధర్మాన్ని పాలించటంలోనే మానవునికి ధన్యత ఉన్నదనీ, ఏ ప్రలోభాలకూ లొంగకుండా ధర్మరక్షణ, దేశరక్షణ చేసుకోవాలని ఉద్బోధించారు.

డిసెంబరు 2వ తేదీ ఉదయం 11 గంటలకు గురుదేవులు నల్లగొండ పట్టణంలో శ్రీ కేతావత్ జయరాం గురుస్వామి వారి నిర్వహణలో ఏర్పాటైన హనుమ ద్దీక్షాపరుల సభకు విజయం చేసారు. తులసీనగర్ భక్తాంజనేయ స్వామివారి దేవాలయంలో దాదాపు వెయ్యి మందికి పైగా భక్తులున్న ఆ సభలో దీక్ష గురించీ, హనుమచ్ఛక్తి గురించీ, దీక్షానంతరం కూడా దీక్షాధారులు అనుసరించవలసిన ధర్మాలు, నియమాలను గురించీ, దేశ ధర్మాల పట్ల వారి బాధ్యత గురించీ వివరించి చెప్పారు. ఆలయ నిర్వాహకులు, సభా నిర్వాహకులు స్వామీజీని సముచితరీతిన స్వాగతించటం, తదుపరి వీడ్కోల్పటం ముదావహం.

డిసెంబరు 4వ తేదీ రాత్రి ఎనిమిది గంటలకు గురుదేవులు అమీర్‌పేట గ్రీన్‌పార్క్ ఫంక్షన్‌హాలుకు-ఆశ్రమాభిమానులు, హితైషులు 'సాయివాణి'కి ప్రధాన సహకారకులూ అయిన మిత్రులు శ్రీ వీరమాచనేని కృష్ణారావు (శ్రీ సాయిశ్రీ ప్రింటర్స్, అమీర్‌పేట)గారి ఆహ్వానంపై వేంచేసారు. కృష్ణారావు గారి పుత్రిక చి॥డాలీ ప్రియకు చి॥ శ్రీకాంత్‌తో జరుగుతున్న నిశ్చితార్థంవేళ గురుదేవులు వారిపై ఆశీరక్షతలు చల్లి సాయినాథుల వారి చిత్రపటాన్ని అందించి వారిని ధన్యులను చేసారు. వారు సముచితరీతిన గురుదేవులను సత్కరించుకొన్నారు.



సాయి వాణి